క్లుప్తంగా

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం

జూలూరుపాడు: పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ మంగళవారం హైదరాబాద్‌లో జరగగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కాకర్ల హైస్కూల్ ఉపాధ్యాయుడు బి.సంపత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శిగా గుండెపుడి హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.వెంకటరమణ ఎన్నికయ్యారు. వీరిని పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి కె హరిలాల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.ప్రభాకర్‌రావు, ఉపేందర్‌తో పాటు దేవేందర్, పుల్లారావు తదితరులు అభినందించారు.

క్వారీల వ్యవస్థను రద్దు చేయాలని వినతి

పాల్వంచరూరల్: మండల పరిధి తోగ్గూడెంలో గిరిజనుల పేరుతో గిరిజనేతరులు నిర్వహిస్తున్న క్వారీలను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోతు శివనాయక్ ఎంపీడీఓ బి.నారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏజెన్సీలో గిరిజనుల పేరుమీద క్వారీలను నడుపుతూ రూ.కోట్ల వ్యాపారం చేస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయాలి

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వెంగన్నపాలెం గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆ పార్టీ వెంగన్నపాలెం గ్రామ సెక్రటరీగా బొల్లు లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

సువార్తను అనుసరించాలి


మాట్లాడుతున్న జాన్

పాల్వంచ: యేసు క్రీస్తు అందించిన రక్షణ సువార్తను అనుసరించాలని పాస్టర్ జాన్ (అమరావతి) అన్నారు. స్థానిక బీసీఎం రహదారిలోని మైదానంలో రెండు రోజులు నిర్వహించనున్న రక్షణ సువార్త మహాసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జాన్ మాట్లాడుతూ.. దేవుని ఆత్మతోను, సత్యముతోను నడవాలన్నారు.

ఆర్థిక సాయం

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని మేదర్‌బస్తీకి చెందిన భూక్యా రాజేష్ గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. ఆర్థిక సోమత లేక ఆపరేషన్ చేయించుకోలేక పోతున్నాడు. విషయం తెలిసిన అభ్యుదయ కళాసేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ మంగళవారం రాజేష్ ఇంటికి వెళ్లి రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజేష్ గుండె అపరేషన్ చేయాలని డాక్టర్ నిర్ధారించారని దాతలు ఆర్థిక సాయం చేయాలని వివరాలకు 9347839198 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చీరల పంపిణీ

జూలూరుపాడు: బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా జూలూరుపాడు న్యూకాలనీలో మాలమహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బుడిపూడి ప్రభాకర్, ఇల్లంగి తిరుపతి పాల్గొన్నారు.

పునాదుల్లోనే జీపీ భవన నిర్మాణాలు

- గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేక అవస్థలు
- నిర్మాణంలో జాప్యం
- మరికొన్నింటికి స్థలం కేటాయింపు ఎప్పుడో?



పునాది దాటని సోములగూడెం, కారెగట్టు పంచాయతీల భవన నిర్మాణాలు

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు మంజూరై ఏడాది దాటినా.. వాటి నిర్మాణానికి ప్రభుత్వ స్థలం దొరకని పరిస్థితి నెలకొంది. స్థలాలు కేటాయించేది ఎప్పుడో, నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో కానీ, నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితులు కన్పిస్తున్నాయి. కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసిన గత ప్రభుత్వం.. ఒక్కో పంచాయతీకి రూ.20లక్షల చొప్పున పక్కాభవన నిర్మాణాలకు మంజూరు చేసింది. ఏడాదైనా నేటికీ నిర్మాణాలు పూర్తికాలేదు. పక్కా భవనాలు లేక గ్రామపంచాయతీలు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోనే అత్యధిక గ్రామపంచాయతీలు కలిగిన పాల్వంచ మండలంలో మొత్తం 36 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతంలో ఉన్న 11 గ్రామపంచాయతీలకు పక్కా భవనాల సౌకర్యం ఉండగా కొత్తగా ఏర్పాటైన 25 గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు లేవు. కొన్ని పంచాయతీలు నెలకు రూ.3 వేలు చెల్లించి అద్దెభవనంలో నిర్వహిస్తుండగా... మరికొన్ని ప్రభుత్వ పాఠశాల్లో కొనసాగుతున్నాయి. నారాయణరావుపేట, దంతలబోరు ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీలకు అద్దె భవనాలు కూడా లేవు. ప్రతీనెల చెట్ల కిందనే గ్రామపంచాయతీ సమావేశాలు నిర్వహిస్తున్నారు.

భవనాలు మంజూరైన గ్రామపంచాయతీలు...

మండలంలో గ్రామపంచాయతీలు	36
పక్కాభవనాలు ఉన్నవి	11
ఏడాది క్రితం మంజూరైన భవనాలు	27
పూర్తయిన భవనాలు	10
స్థలాలు దొరకని పంచాయతీలు	6
స్లాబ్‌లెవల్ నిర్మాణంలో ఉన్నవి	7
పునాదుల్లో ఉన్న భవనాలు	4

రేగులగూడెం, లక్ష్మీదేవిపల్లి, కారెగట్టు, సత్యనారాయణపురం, పునుకుల, కోడిపుంజులవాగు, కిన్నెరసాని, ఇల్లెందులపాడుతండా, తవిశలగూడెం, కొత్తసురారం, బిక్కుతండా, పాల్వంచలక్ష్మీదేవిపల్లి, బస్వతారకలానీ, కేశవపురం, నాగారంకాలనీ, రంగాపురం, నారాయణరావుపట, సంగం, ఉల్వనూరు బంజర, మల్లారం, ఇల్లెందులపాడుతండా, రెడ్డిగూడెం గ్రామపంచాయతీలకు 2022లో ప్రభుత్వం పక్కాభవనాలు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.20లక్షలు కేటాయించి ఏడాది గడుస్తున్నా.. నిర్మాణానకి ప్రభుత్వ స్థలం దొరకడం లేదు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 12 , ఐటీడీఏశాఖ 13 భవనాలను నిర్మాణం చేపట్టింది.


అద్దె ఇంట్లో కొనసాగుతున్న పాండురంగాపురం తండా పంచాయతీ కార్యాలయం

అయితే పది గ్రామపంచాయతీల భవనాలు పూర్తి కాగా.. దంతలబోరు ఎస్సీకాలనీ భవనం నిర్మాణంలో ఉంది. కారెగట్టు గ్రామంలో భవన నిర్మాణం మొదలైన తర్వాత రాజకీయాల కారణంగా పునాదుల్లోనే నిలిచిపోయింది. బిక్కుతండా, బంద్రుగొండ, చంద్రాలగూడెం, బంజర, ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి, ప్రభాత్‌నగర్, ఎస్ లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ భవనాలు స్లాబ్‌లెవల్లో ఉన్నాయి.

పునాదుల్లోనే... సోములగూడెం, కారెగట్టు, దంతలబోరు ఎస్సీకాలనీ, కోడిపుంజులవాగు పంచాయతీల భవన నిర్మాణాలు పునాదులోనే ఉన్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గ్రామపంచాయతీలు ఇరుకు గదులు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థలాలు దొరకక జాప్యం..



ఈజీఎస్ పథకం కింద 2022 మండలంలో 25 గ్రామపంచాయతీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20లక్షలు చొప్పున మొత్తం రూ.4.70 కోట్లు కేటాయించారు. స్థలాలు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఒత్తిడి చేస్తున్నాం. ప్రభుత్వ స్థలాలు దొరకకపోవడంతో నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది.

– బి.నారాయణ, ఎంపీడీఓ

అద్దె భారం అవుతోంది..



మండలంలో పలు గ్రామపంచాయతీలకు పక్కాభవనాలు లేక అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. అయితే అద్దె భవనంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఏదైనా సమావేశం నిర్వహించినప్పుడు మరీ ఇబ్బందిగా ఉంటోంది. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు కూడా లేవు. వెంటనే మా పంచాయతీ భవనానికి స్థలం కేటాయించి, నిర్మాణం ప్రారంభించాలి. – ప్రేమ్‌కుమార్, సోములగూడెం

స్థలాలు కేటాయిస్తాం...



మండలంలో మంజూరైన గ్రామపంచాయతీలకు ఇప్పటికే 20 జీపీల భవనాలకు స్థలాలను కేటాయించడం జరిగింది. మరో ఆరు పంచాయతీలకు ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నాం. కొన్ని ప్రభుత్వ స్థలాలు వివాదంలో ఉన్న కారణంగా జాప్యం జరుగుతోంది. వాటిని కూడా త్వరలోనే కేటాయించి భవన నిర్మాణాలు ప్రారంభిచేలా చర్యలు తీసుకుంటాం. – వివేక్, తహసీల్దార్

సాంస్కృతిక పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేసన్ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో రీజినల్ స్థాయి సాంస్కృతిక పోటీలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. మంగళవారం సీఈఆర్ క్లబ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బండలను కరిగించే శక్తి పాటలకు ఉంటుందన్నారు. ప్రతీ మనిషిలో ఒక కళ దాగి ఉంటుందని, దానిని వెలికి తీసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. సాధన చేయటం ద్వారా కళలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి పాటలు ఎంతో ఉపయోగపడినట్లు తెలిపారు. మంచి సంగీతం మానసిక ఒత్తిడిని జయిస్తుందన్నారు. ప్రేరణాత్మక సంగీతాన్ని వింటే జీవితంలో మరింత ప్రేరణ లభిస్తుందని తెలిపారు. ప్రతీ సంవత్సరం సింగరేణి క్రీడలను నిర్వహిస్తోందని, ప్రతిభ చూపిన వారిని ప్రోత్సహిస్తుందన్నారు. యువ ఉద్యోగులు క్రీడలలో రాణించి ఇల్లెందుకు మంచిపేరు తీసుకుని రావాలని కోరారు. ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం తరుపున అన్వర్, క్రీడల కార్యదర్శి సాయి స్వరూప్, క్రీడల సమన్వయ కర్త రమేష్ సింగ్ పాల్గొన్నారు.

సింగరేణి ఏరియాలో ఫ్యామిలీ డే


వేడుకలను ప్రారంభిస్తున్న మధురవాణి షాలెంరాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో మంగళవారం రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఫ్యామిలీ డే మరియు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లేడీస్ క్లబ్ సభ్యులకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి షాలెంరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆటల పోటీలను ప్రారంభించారు. విజేతలకు రుద్రంపూర్ ప్రగతివనంలో జరిగే బతుకమ్మ ప్రధాన వేడుకలలో బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ సునీత, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ సీహెచ్ సాగర్, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపించండి..

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడం లేదు. దీంతో నిత్యం విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బస్సులు నడవని గ్రామాలను గుర్తించి వెంటనే బస్సు సర్వీసులను నడిపించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌రావును మంగళవారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించినట్లు దంతలబోరు ఎస్సీకాలనీ మాజీ సర్పంచ్ గద్దల రమేష్ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామాలైన నాగారం, నారాయణరావుపేట, సంగం, దంతలబోరు ఎస్సీకాలనీ, బంద్రుగొండ, దంతలబోరు గ్రామాలకు గత ప్రభుత్వ హయాంలో బస్సులు నడిపారు. కొన్ని నెలలుగా బస్సులు నడపడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన స్కూల్, కళాశాలలకు వెళ్లే పేద విద్యార్థులు బస్సులు లేక ఆటోల ద్వారా వెళ్తున్నారు. ఆ ఆటోలు కూడా సమయానికి రాకా, చార్జీలకు డబ్బులు లేక అవస్థలు పడుతున్నారు. ప్రజాపాలనలో మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని పొందలేకపోతున్నారని వెంటనే బస్సు సర్వీసులు నడిపించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన మంత్రి ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామి ఇచ్చినట్లు రమేష్ తెలిపారు.

బెల్ట్ షాపులను అరికట్టండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): మణుగూరు ప్రాంతంలో చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులను అరికట్టాలని, సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ పోస్టుల లో సింగరేణి భూ నిర్వాసితులకు అవకాశం కల్పించి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు సామాజిక సేవకులు కర్నే బాబూరావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో పర్మనెంట్ వార్డుబాయ్‌ల రాకతో వార్డ్ బాయ్ ఉపాధి కోల్పోయి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పరుగుపందెంలో పాల్గొని అర్హత సాధించి తొమ్మిది నెలలుగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న సింగరేణి వార్డు బాయ్‌లు ఆర్.విద్యాసాగర్, కదారి రాము, మనోజ్‌లకు నూతన బొగ్గు గనుల కోసం భూదానం చేసిన నిర్వాసితులు వెంకట్రామ్, అమరశెట్టి సాయి, ఇర్షాద్‌పాషాలకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. విచారణ జరిపి సమస్యలు పరిష్కారిస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చినట్లు బాబూరావు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రావుల మురళీ, దుగ్గిరాల సుధాకర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్, హెచ్ఆర్ డైరెక్టర్ అజయ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, క్వార్టర్లు నిర్మించాలని, హెచ్ఆర్ఏ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటీవ్ విడుదల చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు.

రుణాల పంపిణీ

టేకులపల్లి: రుణమాఫీ అయిన తరువాత రుణాలు తీసుకున్న రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని బేతంపూడి సొసైటీ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ లక్కినేని సురేందర్ రావు అన్నారు. సొసైటీ ద్వారా రుణమాఫీ అయిన వారికి మంగళవారం తిరిగి రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

వృత్తి విద్యలో రాణించాలి

పాల్వంచ: వృత్తి విద్యా కోర్సులను నేర్చుకుని, తద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని దక్షిణాఫ్రికాకు చెందిన సీఈపీఐసీఐ జనరల్ మేనేజర్ అకాయో అలెక్సాండ్రీ అన్నారు. మంగళవారం నవ లిమిటెడ్ కర్మాగారాన్ని వారి బృందం సభ్యులు పరిశీలించారు. కర్మాగారంలో ఉత్పత్తి తీరును పరిశీలించారు. అనంతరం మహిళా సాధికార కేంద్రంలో టైలరింగ్, బ్యూటీషియన్, టాలీ, డీటీపీ కోర్సుల్లో శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు సరిఫికెట్లు అందించారు. నిఖిల్ దేవినేని, దుర్గాప్రసాద్, ఎల్‌వీ.శరత్‌బాబు పాల్గొన్నారు.

ఇఫ్టూ విలీనసభను జయప్రదం చేయాలి


సూపర్‌బజార్(కొత్తగూడెం): పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: 20వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో టీయూసీఐ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. విప్లవ పార్టీల కలయిక ప్రజా ఉద్యమాలకు మంచి పరిస్థితులను కల్పిస్తుందని, సుమారు 18 రాష్ట్రాలలో నిర్మాణం కలిగిన మూడు విప్లవ పార్టీల అనుబంధ కార్మిక సంఘాలు ఒకే సంఘంగా ఏర్పడబోతోందన్నారు. సభకు కార్మికులు, కార్మిక అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ పాల్వంచ ఏరియా కమిటీ అధ్యక్షుడు వేల్పుల రమేష్, పూనెం రమేష్, తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న జరగనున్న విలీన సభను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా కోశాధికారి పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. మంగళవారం పోస్టాఫీస్ అడ్డాలో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎం.చంద్రశేఖర్, రాధా పుష్పరాజ్, వెంకటేశ్వర్లు, శ్రీను, సంజీవ్, నిర్మల, మరియ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలురంగాల్లో 'పీడీఎస్‌యూ' నేతల ప్రతిభ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఎన్నో రంగాల్లో ప్రతిభావంతులను అందించిన ఘనత పీడీఎస్‌యూకు ఉందని, ఆ సంస్థ 50 వసంతాలు నిండిన సందర్భంగా నాటి స్మృతులను త్యాగాలను నెమరు వేసుకుంటున్నట్లు పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు తాళ్లూరి వేణు, బాలు, కేవీ, జే.సీతారామయ్య, గౌని ఐలయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులో పెన్షనర్ భవన్‌లో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్యా సాధన, సమసమాజ స్థాపన లక్ష్యంగా పని చేస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడుతుందన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో, 21న ఖమ్మంలో జరగనున్న సమావేశంలో అత్యధికంగా విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఎన్డీ రాష్ట్ర నాయకులు మధు మాట్లాడుతూ...

ఈ సంఘం విస్తరణ కోసం పని చేసిన అనేక మంది నేతలను అటు రాజ్యం, ఇటు మతోన్మాదులు, ఇతర సంస్థల వారు అత్యంత పాశవికంగా హతమార్చారని, అయినా సంఘం ధృఢంగా నిలబడిందన్నారు. ఈ సమావేశంలో ఎస్.పూర్ణచందర్ రావు, ఇర్ప రాజేష్, బి.ముత్యం, తుపాకుల నాగేశ్వరరావు, ముక్తి సత్యం, ప్రణయ్‌కుమార్, కె.సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, డి.ప్రసాద్, ఎల్.వీరమోహన్, ఏనుగుల ప్రకాష్, జానకి, సీతారామరాజు, కండె లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, టి.నాగరాజు, యాకుబ్‌పాషా, తిరుపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి, ఏడోరోజు మంగళవారం మహిళలు వేపకాయ బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను ప్రతిష్ఠించారు. సాయంత్రం దేవాలయాలు, కూడళ్లల్లో బతుకమ్మలను తీసుకొచ్చి వాటి చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. అనంతరం సమీపంల్లోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తగూడెంరూరల్: మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో బహుమతులు పంపిణీ...


టేకులపల్లి: కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలకు హాజరైన కార్యదర్శులు


పాల్వంచ: కేటీపీఎస్‌లో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న సీతఈ ప్రభాకర్‌రావు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆరో రోజు మంగళవారం శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్దమ్మతల్లి ఆలయం వద్ద నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. మండపాల వద్ద భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో...


ఇల్లెందు: పూజలు చేస్తున్న చైర్మన్ డీవీ తదితరులు


ఇల్లెందు: నంబర్-2 బస్తీ రామాలయంలో..


అన్నప్రసాదం పంపిణీ


జూలూరుపాడు: అన్నారుపాడులో


పాల్వంచరూరల్: శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు


సుజాతనగర్: అమ్మవారి మండపంలో కరెన్సీతో అలంకరించిన దృశ్యం

'జబర్దస్త్'గా దసరా ఉత్సవాలు

- విజయవంతం చేసేందుకు కసరత్తు
- ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి

ఇల్లెందు: 12వ తేదీన ఇల్లెందులో జరగనున్న మైసూర్‌ను మరిపించే దసరా ఉత్సవాలను అలరించేందుకు జబర్దస్త్ టీం విచ్చేస్తోంది. యాంకర్ స్వరూప, కళాకారులు ఫైమా, నూకరాజు, ఇమ్మానియేల్‌తో పాటు సింగర్లు వస్తున్నారు. ఉత్సవాల విజయవంతం కోసం పక్కా ప్రణాళికను రూపొందించామని చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. గతానికి భిన్నంగా ఈసారి పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌ను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సింగరేణి సంస్థ గ్రౌండ్‌లో ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసింది.

ట్రాఫిక్ ఆంక్షలు..

ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. గత సంవత్సరం జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఉత్సవాలకు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీని వల్ల ఉత్సవాలు తిలకించేందుకు వచ్చినవాళ్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి ఉత్సవ ప్రదేశం గ్రౌండ్ పరిసరాలలోకి పూజల కోసం వచ్చే రథాలను మాత్రమే అనుమతిస్తున్నారు. ఇతర వాహనాలకు అనుమతి లేదు.


మైదానంలో పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ, డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ

వాహనాల మళ్లింపు ఇలా..

ఈ దఫా ఉత్సవాలకు ట్రాఫిక్ మళ్లించాలని నిర్ణయించారు. ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు, జీపులు ఇతర వాహనాలు బీట్ మార్కెట్ రోడ్ గుండా ఇందిరానగర్ మీదుగా జేకే బస్టాఫ్‌కు చేరుకునేలా మళ్లిస్తున్నారు. బస్‌లు, లారీలు ఇతర పెద్ద వాహనాలు జేకే బస్టాఫ్ గుండా సింగరేణి బైపాస్ రోడ్ గుండా లలిత కళామందిర్ రోడ్‌లో బస్టాండ్‌కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రి వద్ద, అటు జేకే బస్టాఫ్ గ్రౌండ్ వద్ద పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి గ్రౌండ్‌లో రెండో గేట్ ఓపెన్ చేసి ట్రాఫిక్‌ను సునాయసంగా లోపలికి రప్పించనున్నారు. వెంగళరావునగర్, 15 నంబర్ బస్తీవాసులు రావడానికి మాంటిస్సోరీ స్కూల్ వైపు రోడ్ క్లియర్ చేసి అటు వైపుకు వచ్చే వాహనాలు మాంటిస్సోరీ స్కూల్ ఎదుట పార్కింగ్ చేసుకునేలా ఆ రోడ్డుకు మరమ్మతులు చేయనున్నారు. గ్రౌండ్‌లోకి వాహనాలు రాకుండా ప్రభుత్వ ఆస్పత్రి, అటు జేకే బస్టాఫ్, సింగరేణి క్వార్టర్ల దారులన్నీ బారికేడ్లతో మూసివేయాలని నిర్ణయించారు.

అధికారులతో సమాలోచనలు..

దసరా ఉత్సవాలు విజయవంతం కోసం ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచనలతో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, డీఈ మురళీకృష్ణ సమాలోచనలు చేశారు. ఏఏ మార్గాల గుండా ప్రజలు గ్రౌండ్‌కు చేరుకోవాలో చర్చించి ఆ ప్రదేశాలను మంగళవారం సందర్శించి పరిశీలించారు. వారి వెంట పట్టణ కాంగ్రెస్ నేతలు దొడ్డా డానియేల్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, సదానందం, కౌన్సిలర్లు ఉన్నారు.